ఫిబ్రవరి నాటికి పన్నులను చెల్లించాలి

- డీపీఓ శ్రీనివాసరావు



నవతెలంగాణ-రామారెడ్డి

ఫిబ్రవరి చివరి నాటికి గ్రామ పంచాయతీకి సంబంధించిన పూర్తి పన్నులను చెల్లించి, గ్రామాభివృద్ధికి తోడ్పడాలని డీపీఓ శ్రీనివాసరావు కోరారు. గురువారం మండల కేంద్రంలో కంటి వెలుగు కార్యక్రమంలో పాల్గొని, కన్నాపూర్ గ్రామంలో నల్ల, ఇంటి తదితర పన్నుల వసూల్లో పాల్గొన్నారు. అనంతరం గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయ్‌కుమార్, ఎంపీఓ సవితరెడ్డి, సర్పంచ్ రాజనర్, ఉపసర్పంచ్ అంజిల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

నిజామాబాద్-కామారెడ్డి

1

శుక్రవారం 20 జనవరి 2023

మెలకువలు పాటించి అధిక దిగుబడిని సాధించాలి

- ఎల్లారెడ్డి ఏడీఏ రత్న



నవతెలంగాణ-రామారెడ్డి

రైతులు మెలకువలు పాటిస్తూ పంటలు సాగు చేసి, అధిక దిగుబడిని సాధించాలని ఎల్లారెడ్డి ఏడీఏ రత్న అన్నారు. గురువారం మండలంలోని గొల్లపల్లిలో క్షేత్రస్థాయిలో పంటల సాగు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించి కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతుల సందేహాల, సలహాలు చేస్తూ నివృత్తి చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి హరీష్ కుమార్, ఏఈఓ రాకేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అందరి జీవితాల్లో వెలుగులు నింపాలి



కంటి పరీక్షలు చేయించుకుంటున్న మంత్రి

- కంటి వెలుగు' మానవత్వంతో కూడిన కార్యక్రమం
- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

దృష్టి లోపాలను దూరం చేయాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'కంటి వెలుగు' కార్యక్రమం మానవత్వం ఇమిడి ఉన్న ఎంతో గొప్ప కార్యక్రమమని రాష్ట్ర రోడ్లు-భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు-2 కార్యక్రమాన్ని నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లో గల స్త్రీ స్వశక్తి భవన్‌లో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అట్టహాసపు ఏర్పాట్ల నడుమ పండుగ వాతావరణంలో గురువారం లాంఛనంగా ప్రారంభించారు. మంత్రి స్వయంగా నేత్ర పరీక్ష చేయించుకుని కంటి అద్దాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ.. కంటి వెలుగు కార్యక్రమం వెనుక ఎలాంటి రాజకీయం లేదని, ఓట్ల కోణం అసలే లేదని స్పష్టం చేశారు. ప్రపంచంలోనే మరెక్కడా లేనివిధంగా, గిన్నిస్ రికార్డును నమోదు చేసే తరహాలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో ఆలోచనాత్మకంగా చేపట్టిన కార్యక్రమమే కంటి వెలుగు అని అన్నారు. ప్రస్తుత సమాజంలో సామాజిక రుగ్మతగా మారిన కంటి సమస్యను పారద్రోలాలనే కృత నిశ్చయంతో 2018లోనే కంటి వెలుగుకు తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మంత్రి గుర్తు చేశారు. తొలి విడతలో రాష్ట్ర వ్యాప్తంగా కోటి 50 లక్షల మందికి నేత్ర పరీక్షలు నిర్వహిస్తే, మూడొంతుల మంది కంటి జబ్బులతో బాధ పడుతున్నారని నిర్ధారణ అయ్యిందని, యాభై లక్షల మందికి కంటి అద్దాలు అందించినట్టు వివరించారు. ఒక్క నిజామాబాద్ జిల్లాలోనే 7 లక్షల మందికి కంటి పరీక్షలు జరిపి, రెండు లక్షల మందికి అద్దాలు పంపిణీ చేశామన్నారు. ప్రస్తుతం రెండవ విడతలో 18 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరికి నేత్ర పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు, కంటి అద్దాలు పంపిణీ చేసేలా విస్తృత చర్యలు చేపట్టినట్టు తెలిపారు. జిల్లాలో 12 లక్షల పైచిలుకు మందికి స్క్రీనింగ్ నిర్వహించేందుకు 70 బృందాలను ఏర్పాటు చేశామని, వంద రోజుల పాటు ఈ శిబిరాలు అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డుల్లో కొనసాగుతాయని తెలిపారు. కంటి వెలుగు శిబిరాల్లో ప్రతి ఒక్కరికి నాణ్యమైన సేవలందేలా పకడ్బందీ ఏర్పాట్లు చేశామని, ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. కంటి చూపు కోల్పోతే ఎదురయ్యే ఇబ్బందులు వర్ణనాతీతమని అన్నారు. ఏఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు ఇంటింటికి వెళ్లి పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరూ కంటి వెలుగు శిబిరాల్లో నేత్ర పరీక్షలు నిర్వహించుకునేలా చొరవ చూపాలన్నారు. అన్ని వర్గాల వారు భాగస్వాములై కంటి వెలుగును విజయవంతం చేసి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ సి.నారాయణరెడ్డి మాట్లాడుతూ కంటి వెలుగు-2 కార్యక్రమం ద్వారా జిల్లాలో 12.30 లక్షల మందికి నేత్ర పరీక్షలు నిర్వహించేందుకు వీలుగా 70 బృందాలు ఏర్పాటు చేశామని అన్నారు. మొదటి విడతలో 31 బృందాలు 160 రోజుల పాటు పని చేశాయని, ప్రస్తుతం వంద రోజుల వ్యవధిలోనే పూర్తి స్థాయిలో లక్ష్యాన్ని సాధించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఆసుపత్రులకు వెళ్లి కంటి పరీక్ష చేయించుకునే వెసులుబాటు లేనివారికి కంటి వెలుగు శిబిరాలు ఎంతో గొప్ప అవకాశంగా నిలుస్తాయని, వీటిని పూర్తి స్థాయిలో ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కంటి వెలుగు శిబిరాల్లో నేత్ర పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు, దూర దృష్టికి కంటి అద్దాలు వెంటనే అందించడం జరుగుతుందని, ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్ అవసరమైన వారికి కూడా 15 నుండి 20 రోజుల్లోపు వారి ఇళ్లకు వెళ్లి అందజేసేలా పకడ్బందీ చర్యలు తీసుకున్నామని అన్నారు. ప్రపంచంలోనే మరెక్కడా లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములై విజయవంతం చేసేందుకు కృషి చేయాలని జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు, అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా, ఎమ్మెల్సీ డి.రాజేశ్వర్, మేయర్ నీతూ కిరణ్ పిలుపునిచ్చారు. నోడల్ అధికారిగా హాజరైన రాష్ట్ర వైద్యారోగ్య శాఖ సంయుక్త సంచాలకులు అంబర్‌సింగ్ నాయక్, నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కె.ఆర్.నాగరాజు, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, చిత్రామిశ్రా, మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్ పర్సన్ ఆకుల లలిత, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు సూదం లక్ష్మి, నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ సుదర్శన్, వివిధ డివిజన్లకు చెందిన కార్పొరేటర్లు, ఆయా శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

గుప్త నిధుల తవ్వకాల కోసం యత్నం

- ఒకరు అరెస్టు
- పరారీలో ఇద్దరు



తవ్వకాలకు ముందు పూజకోసం ఏర్పాటు చేసిన నిమ్మకాయలు, ఇతర వస్తువులు

నవతెలంగాణ-వర్ని

చందూర్ మండలంలోని గన్నూర్ గ్రామంలోని పాత బడిన బురుజు ప్రాంతంలో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి, బోధన్‌కు చెందిన ఇద్దరు కలిసి గుప్త నిధుల కోసం పట్టపగలే తవ్వకాలు చేపట్టేందుకు యత్నించారు. గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందజేయడంతో పోలీసులు అక్కడికి చేరుకోగానే.. అంతలోపే ఇద్దరు వ్యక్తులు పారారయ్యారు. కాగా మరొకరిని పట్టుకుని అతనిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తామని తెలిపారు.

నేడు స్పీకర్ రాక

నవతెలంగాణ-కోటగిరి

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఉమ్మడి మండలాల్లోని ఆయా గ్రామాలకు చెందిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులను స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పంపిణీ చేయనున్నట్టు టీఆర్ఎస్ నాయకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎమ్మెల్యేపై ఆరోపణలు రుజువు చేస్తే రాజీనామా చేస్తా

- దూపల్లి సింగిల్ విండో చైర్మన్



మాట్లాడుతున్న చైర్మెన్

నవతెలంగాణ-రెంజల్

బోధన్ ఎమ్మెల్యేపై ఆరోపణలు రుజువు చేస్తే రాజీనామా చేస్తానని దూపల్లి సింగిల్ విండో చైర్మన్ దూపల్లి సొసైటీ చైర్మన్ శేషుగారి భూమారెడ్డి స్పష్టం చేశారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. తమ ఎమ్మెల్యేపై చేస్తున్న ఆరోపణలు వాస్తవం కాదని, జిల్లా కలెక్టర్ ప్రత్యేక టీంను ఏర్పాటు చేసి విచారణ చేసి క్లీన్ చీట్ ఇచ్చినప్పటికీ, కాంగ్రెస్ నాయకులు ఆరోపణలు చేయడం శోచనీయమన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులను ఓర్వలేక ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండలాధ్యక్షులు ఏకార్‌పాషా, సీనియర్ జిల్లా నాయకులు రఫీక్, రైతు సమన్వయ కమిటీ మండల అధ్యక్షులు కాశం సాయిలు, బూర్గం ఉపసర్పంచ్ ఫిరోజ్ ఉద్దీన్, సాయగౌడ్, ముకీద్, గఫర్, పోశెట్టి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మండల ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి



తహసీల్దార్‌కు సన్మానం

నవతెలంగాణ-భిక్కనూర్

తహసీల్దార్‌గా బాధ్యతలు తీసుకున్న ప్రేమ్‌కుమార్ మండల ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీపీ గాల్‌రెడ్డి తెలిపారు. గురువారం ఎంపీపీ కార్యాలయంలో తహసీల్దార్ ప్రేమ్‌కుమార్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి సమస్యలున్నా తక్షణమే పరిష్కరించాలని కోరారు. అధికారులకు ప్రజాప్రతినిధులు ఎల్లవేళలా అండగా ఉంటారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మండల తహసీల్దారుగా ప్రేమ్‌కుమార్ బాధ్యతలు తీసుకోనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి అనంతరావు, ఎస్ఐ ఆనంద్‌గౌడ్, ఆత్మ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, మార్కెట్‌కమిటీ చైర్మన్ భగవంతరెడ్డి, పట్టణ మాజీ సర్పంచి నాగభూషణం గౌడ్, తదితరులున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత



చెక్కులు అందజేస్తున్న ఎంపీపీ

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండల కేంద్రానికి చెందిన శంకర్‌కు రూ.18వేలు, గడ్డం రాజుకు రూ.32వేల చెక్కును ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి గురువారం అందజేశారు. గతంలో ఆయన అనారోగ్యానికి గురై దవాఖానలో చికిత్స పొందారు. దీంతో ఆయన ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోవడంతో ఆయనకు చెక్కును అందించామని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి, సాయిరెడ్డి, బీఆర్ఎస్ యూత్ మండల ప్రెసిడెంట్ చిప్ప రమేష్, గంగాధర్, సాయగౌడ్, సందీప్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్ రద్దుచేసి..
తీర్మానాన్ని ప్రభుత్వానికి పంపిస్తాం

- కన్సల్టెంట్లపై అధికారులకు కంప్లైంట్ చేస్తాం
- మున్సిపల్ చైర్‌పర్సన్ జాహ్నవి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ జాహ్నవి

నవతెలంగాణ-కామారెడ్డిటౌన్

మాస్టర్ ప్లాన్ రద్దుచేసి.. తీర్మానాన్ని ప్రభుత్వానికి పంపిస్తామని, కన్సల్టెంట్లపై అధికారులకు కంప్లైంట్ చేస్తామని మున్సిపల్ చైర్మన్ జాహ్నవి అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ.. గత 45 రోజులుగా రైతులు మాస్టర్ ప్లాన్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ఆనివార్య కారణాలవల్ల సమావేశం ఏర్పాటు చేయలేకపోయామని రైతులకు క్షమాపణ చెప్పారు. శుక్రవారం సమావేశాన్ని ఏర్పాటు చేసి మున్సిపల్ డ్రాఫ్టను రద్దుచేసి ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు. డీడీటీ కన్సల్టెంట్‌పై అధికారులకు కంప్లైంట్ ఇస్తామని తెలియజేశారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మున్సిపల్ సమావేశంలో కౌన్సిల్ తీర్మానానికి వ్యతిరేకంగా బీడీఎఫ్ కన్సల్టెంట్ మాస్టర్‌ప్లాన్ ముసాయిదాను తయారుచేసి ఇచ్చిందని తెలిపారు. కన్సల్టెంట్‌పై నివేదిక పంపించామని, రామేశంపల్లి, హిల్చిపూర్, టేక్రియాల్ గ్రామాలను రెసిడెన్షియల్‌గా కౌన్సిల్ తీర్మానం చేస్తే, కన్సల్టెంట్ ఇండస్ట్రియల్ జోన్‌గా ప్రకటించిందని తెలిపారు. టీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల కోసం పనిచేస్తుందని, రైతులను ప్రతిపక్ష పార్టీలు తప్పుదోవ పట్టిస్తున్నాయన్నారు. ఇండస్ట్రియల్ జోన్, గ్రీన్ జోన్‌లలో ఏ ఒక్క రైతు భూమి గుంట కూడా తీసుకోబోమని తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఇప్పటివరకు 2396 దరఖాస్తులు వచ్చాయని, అభ్యంతరం స్వీకరించిన తర్వాత పున పరిశీలించి, కౌన్సిల్ తీర్మానం చేసిన తర్వాతే మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తామని అన్నారు.

అదుపు తప్పిన కారు..

- పలువురికి గాయాలు



అదుపు తప్పిన కారు

నవతెలంగాణ-భిక్కనూర్

కారు అదుపు తప్పి బోల్తాపడి ఆరుగురికి తీవ్ర గాయాలు కాగా వెంటనే వారిని చికిత్స నిమిత్తం కామారెడ్డి ఆసుపత్రికి తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన సంతోష్ ఆగర్వాల్ కుటుంబ సభ్యులు కారులో హైదరాబాదు వెళ్తున్నారు. మండల పరిధిలోని బస్వాపూర్ గ్రామం వద్దకు రాగానే కారు అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో కారులో ఉన్న డ్రైవర్ సంతోష్ అగర్వాల్, సునీత, పద్మ, లలిత, కృష్ణ, ప్రతాప్‌కు గాయాలయ్యాయి. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



గాయాలపాలైన వారిని ఆస్పత్రికితరలింపు

ప్రభుత్వ సొమ్ముతో బీఆర్ఎస్ సభ

- మాజీ మంత్రి షబ్బీర్ అలీ



మాట్లాడుతున్న మాజీ మంత్రి షబ్బీర్ అలీ

నవతెలంగాణ-కామారెడ్డిటౌన్

ఖమ్మంలో బీఆర్ఎస్ సభను ప్రభుత్వ సొమ్ముతో ఏర్పాటు చేశారని మాజీ మంత్రి షబ్బీర్ అలీ అన్నారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నీళ్ళు, నిధులు, నియామకాల డిమాండ్‌తో ఏర్పడిన తెలంగాణలో ఏ ఒక్కటీ అమలు కాలేదన్నారు. నాడు ఆంధ్రావాళ్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసీఆర్.. నేడు అదే ఆంధ్రావాళ్ళతో అలైబలై చేసుకుంటున్నారన్నారు. తెలంగాణ ఏర్పడిన 9 సంవత్సరాల్లో ఏం చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఏ రంగంలో నిలదొక్కుకున్నదో చెప్పాలన్నారు. దేశంలో వంద యూనివర్సిటీలు ఉంటే అందులో తెలంగాణకు చెందిన ఒక్క యూనివర్సిటీ కూడా పేరుగాంచిన దాఖలాలు లేవన్నారు. విద్యారంగంలో తెలంగాణ వెనుకబడిందన్నారు. ఫ్యాక్టరీలు మూత పడ్డాయని, 4వేల పాఠశాలలను మూసేసారని తెలిపారు. స్కాలర్ షిప్ రాక విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారన్నారు. ఫీజ్ రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో కళాశాల యాజమాన్యాలు విద్యార్థులకు ఒరిజినల్ సర్టిఫికెట్స్ ఇవ్వడం లేదని, తద్వారా ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోలేకపోతున్నారని చెప్పారు. ఖమ్మంలో ఫ్లాప్ షో జరిగిందని, 5 లక్షల మంది వస్తారని ప్రగల్భాలు పలికిన లక్ష మంది కూడా రాలేదని ఎద్దేవా చేశారు. ఖమ్మం సభ ఖర్చు మొత్తాన్ని తెలంగాణ ప్రజల నెత్తిన మోపారని ఆరోపించారు. పార్టీ డబ్బుతో సభ ఏర్పాటు చేసుకోవాల్సి ఉండగా ప్రభుత్వ డబ్బు ఎలా ఖర్చు చేస్తారని ప్రశ్నించారు. కలెక్టర్ కార్యాలయం, కంటి వెలుగు కార్యక్రమాల ప్రారంభోత్సవాల పేరుతో ప్రైవేట్ కార్యక్రమం పెట్టారని, దీనికి ఐదుగురు ముఖ్యమంత్రులను ఆహ్వానించారన్నారు. దీనిపై విచారణకు కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుందని, టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డిని కలిసి దీనిపై చర్చించి గవర్నర్‌ను కలిసి లేఖ ఇస్తామన్నారు.

కంటి వెలుగు కార్యక్రమం పేరుతో కోట్ల రూపాయలు వృథా చేసుకంటే జిల్లాకు ఒక కంటి ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని, తద్వారా ఏడాదంతా ప్రజలకు సేవలు అందుతాయని తెలిపారు. 60 సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో 60 వేల కోట్ల అప్పు ఉందని, 10 వేల కోట్ల మిగులు బడ్జెట్ ఉంటే ఇప్పుడు తెలంగాణ ప్రజల చేతికి చిప్ప ఇచ్చారని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో విద్యుత్ సంస్కరణల కోసం కేంద్రం నుంచి 5 వేల కోట్లు తెచ్చి తెలంగాణలో సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేశామన్నారు. 9 ఏండ్లలో తెలంగాణ ప్రభుత్వం 5 లక్షల కోట్ల అప్పు తెచ్చిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్లో 21 శాతం ఈ అప్పు వడ్డీకి వాయిదాలకే పోతుందని పేర్కొన్నారు. ఏసీడీ బిల్లుల పేరుతో ప్రజల వద్ద దోచుకుంటున్నారని ఆరోపించారు. సర్పంచులకు పెండింగ్ బిల్లులు ఇవ్వలేదని, జిల్లా పరిషత్ కార్యాలయాల్లో చాయ్ తాగడానికి కూడా నిధులు లేకుండా చేశారని ఆరోపించారు. ఖమ్మంలో జరిగిన సభకు అయిన ఖర్చు మొత్తం వివరాలను బేషరతుగా ప్రజలకు చూపాలని డిమాండ్ చేశారు.

నాటు తుపాకీ పేలి
వేటగాడు మృతి

- నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలంలో ఘటన



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-సిరికొండ

నాటు తుపాకీ పేలి వేటగాడు మతిచెందాడు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని తూంపల్లి గ్రామ శివారులో గల కొత్త తిరుపతి మందిరం సమీపంలోని చిన్న మైసమ్మ ప్రాం తంలో చోటుచేసుకుంది. ఎస్ఐ నర్సింలు వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలంలోని సోమార్‌పేట్ గ్రామ పరిధిలోని సార్ధపూర్ తాండాకు చెందిన బానవత్ రావూజి (36) అనే యువకుడు మరో ఇద్దరు యువకులతో కలిసి తూంపల్లి సమీపంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో ఏదు వేటకు బుధవారం రాత్రి వెళ్లారు.

వివరాలు మెయిన్‌లో..

ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ, కేసులో
మరో ఏడుగురి అరెస్ట్

నవతెలంగాణ-బోధన్

నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలో తెలుగు ఉపాధ్యాయుడు మల్లికార్జున్ తనకు పాఠశాలలో విధి నిర్వహణలో ఉండగా.. కొంతమంది వచ్చి ఉద్దేశపూర్వకంగా దేవుళ్లను అవమానపరిచినట్టు పేర్కొంటూ బలవంతంగా గుడిలోకి తీసుకెళ్లి బొట్టుపెట్టి అవమానించిన ఘటనలో ఉపాధ్యాయుడు మల్లికార్జున్ 10 మందిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోటగిరి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అందులో భాగంగా గురువారం ఏడుగురిని అరెస్టు చేసినట్టు ఏసీపీ కిరణ్ కుమార్ తెలిపారు.

వివరాలు మెయిన్‌లో..

ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడి మృతి

నవతెలంగాణ-బోధన్



వీరయ్య (ఫైల్)

సాలూర మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన మొండూర్ వీరయ్య(26) ఈనెల 12వ తేదీన గ్రామ సమీపంలోని గిద్ద చెరువు వద్దకు కాలకృత్యాల కోసం వెళ్లగా.. ప్రమాదవశాత్తు చెరువులోపడి మునిగి మృతిచెందినట్టు బోధన్ రూరల్ ఎస్ఐ సందీప్ తెలిపారు. 12వ తేదీన కాలకృత్యాల కోసం వెళ్ళిన మొండూర్ వీరయ్య ఇంటికి రాకపోవడంతో ఆయన కుటుంబీకులు బంధువుల ఇండ్లలో, ఇతర ప్రాంతాలలో గాలించారు. అయిన ఆయన ఆచూకి లభించలేదు. గురువారం గిద్ద చెరువులో శవం తేలియాడుతుండడంతో అటువైపు వెళ్లిన కొంతమంది చూసి అతని కుటుంబీకులకు సమాచారం అందించారు. దాంతో వారు శవాన్ని మొడూర్ వీరయ్యగా గుర్తించారు. ఈ సమాచారంతో ఘటనా స్థలానికి బోధన్ రూరల్ పోలీసులు చేరుకుని శవ పంచనామా నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు. కాలనీలో అందరితో కలుపుగోలుగా ఉండే యువకుడు మృతి చెందడంతో కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతునికి ఇద్దరు కుమారులు, భార్య ఉన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన మృతుడు మొండూర్ వీరయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు. మృతుని భార్య శివరాణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిషోర బాలికలకు అవగాహన

నవతెలంగాణ-రెంజల్

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిషోర్ బాలికలకు గురువారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ రజిని కిషోర్ హాజరయ్యారు. ఆడపిల్లలకు ఈ టీచింగ్ చేస్తే 1098, లేదా 100కు డయల్ చేయడం గురించి వివరించారు. బాల్యవివాహాలను అరికట్టడం, బాలికల రక్తహీనతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి గణేష్‌రావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల రాణి, ఉపాధ్యాయులు గంగాధర్, అంగన్వాడీ టీచర్లు సురేఖ, సుజాత, పద్మ, రాజ్యలక్ష్మి, రజిత, తదితరులు పాల్గొన్నారు.

యూజీ పరీక్షల్లో ఒకరు డిబార్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో గురువారం యూజీ 2వ సెమిస్టర్ (బ్యాక్‌లాగ్) పరీక్షలో 3433మంది విద్యార్థులకు గాను 3250మంది హాజరయ్యారని, 183మంది గైర్హాజరయ్యారని తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారిణి ప్రొఫెసర్ డాక్టర్ ఎం అరుణా తెలిపారు. మధ్యాహ్నం జరిగిన 5వ సెమిస్టర్ (రెగ్యులర్), 6వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షల్లో 10463 గాను 9673మంది హాజరయ్యారని 790మంది గైర్హాజరయ్యారని అన్నారు. బోధన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రం లో 5వ సెమిస్టరు రెగ్యులర్ ఆడిటింగ్ పరీక్ష లో ఒక విద్యార్థి మాల్ ప్రాక్టీస్ కి పాల్పడుతూ డిబార్ అయ్యారని అరుణ వివరించారు. ఇప్పటి వరకు డిగ్రీ పరీక్షల్లో మొత్తం 23 మంది విద్యార్థులు మాల్ ప్రాక్టీస్ చేస్తూ బుక్ అయ్యారని పరీక్షల నియంత్రణ అధికారిణి ప్రొఫెసర్ డాక్టర్ అరుణ తెలిపారు.

కేర్‌టేకర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

రీజినల్ కోఆర్డినేటర్ సంపత్ కుమార్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగర శివారులో నాగరంలోగల గిరిజన సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో పొరుగు సేవల పద్ధతిన కేర్ టేకర్ పోస్టుకు దరఖాస్తులను ఈ నెల 27 వరకు చేసుకోవాలని ఆ సంస్థ ప్రాంతీయ సమన్వయకర్త టి.సంపత్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాచిలర్ ఆఫ్ డిగ్రీలో హొటల్ మేనేజ్మెంట్ పూర్తి చేసిన మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు సంబంధిత కళాశాలలో దరఖాస్తు సమర్పించాలని సూచించారు. విద్యార్హతల ప్రకారం పూర్తి మెరిట్ ఆధారంగా జిల్లా అదనపు కలెక్టర్ ఆమోదంతో ఎంపిక ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా జెడ్పీ చైర్మన్ దాదాన్నగారి విఠల్ రావు
- కంటివెలుగు ప్రారంభం

నవతెలంగాణ-విలేకరుల బృందం

మాక్లూర్:రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పి చైర్మన్ దాదాన్నగారి విఠల్ రావు అన్నారు. మండలంలోని బొకంపల్లి గ్రామంలో కంటి వెలుగు కేంద్రాన్ని జెడ్పి చైర్మన్ విఠల్, ఆలూరు మండలంలోని కల్లెడ గ్రామంలో మాక్లూర్ ఎంపిపి మస్త ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంటి పరీక్షలు చేసి అవసరం ఉన్న వారికి కంటి అద్దాలను, కంటి ఆపరేషన్ ఉచితంగా చేస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మ, కల్లెడ ఉపసర్పంచ్ పుంజు మనీష్ గౌడ్, వైస్ ఎంపిపి సక్కి సుజాత సుధాకర్, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, ఎంపిడిఓ క్రాంతి, ఎంపిఓ శ్రీనివాస్, ఎంపిటిసి ఫోరమ్ అధ్యక్షులు సత్యనారాయణ, ఐకెపి ఏపీఎం అనిల్ కుమార్, కంటి వెలుగు వైద్యులు, సిబ్బంది, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

నిజామాబాద్‌రూరల్:కొత్తపేట్ గ్రామంలో రెండవ దఫా కంటివెలుగును ఎంపీపీ బానోత్ అనూష ప్రేమ్ నాయక్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనిల్ కుమార్, ఎంపీడీవో మల్లేష్, గ్రామ సర్పంచ్ బొడేగే లావణ్య ప్రవీణ్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు బానోత్ గోపాల్ నాయక్, ఉప సర్పంచ్ సుదర్శన్, పార్టీ సీనియర్ నాయకులు వసంతరావు నాయక్, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని మల్లారం గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీ బనోత్ అనూష ప్రేమ్ దాస్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో, తహసీల్దార్ అనిల్, సర్పంచ్ బొడిగె లావణ్య ప్రవీణ్ గౌడ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ నాయకులు, పాల్గొన్నారు.

ధర్పల్లి:కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీ నల్ల సారిక హన్మంత్ రెడ్డి, సర్పంచ్ ఆర్మూర్ పెద్ద బాల్ రాజు, సొసైటీ చైర్మన్ మల్లికార్జున్, ఎండీఓ నటరాజ్, వైద్యాధికారి రఘువీర్ గౌడ్, నాయకులు ధారవత్ గోపాల్, అర్గుల్ రాజేశ్వర్, సుభాష్, లొక్కిడి రాములు, అబ్దుల్ మజీద్, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి:కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలని ఎంపీపీ అధ్యక్షురాలు లోలపు గౌతమి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ గడ్డం స్వామితో కలిసి కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిచారు. ఈ సందర్భంగా పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన సభలో ఎంపీపీ మాట్లాడారు. కంటి పరీక్ష చేసి సమస్య ఉన్నవారికి కళ్లద్దాలు, మందులు అందిస్తారని తెలిపారు. మోతి బిందు ఉంటే వారికి ఉచితంగా ఆపరేషన్ కూడా చేస్తారనానరు. సుగర్ వ్యాధిగ్రస్తులు, ఇతర కంటి సమస్యలు ఉన్నవారికి, రెటినా సమస్య, గ్లూకోమా సమస్య ఉన్నవారికి కూడా ప్రత్యేక పరీక్షలు చేసి వైద్యం పూర్తి ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. అనంతరం రిబ్బన్ కట్‌చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు ముందుగా బషీరాబాద్ సర్పంచ్ సక్కరం అశోక్‌కు వైద్యాధికారులు కంటి పరీక్షలు నిర్వహించి లాంచనంగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా ప్రత్యేక అధికారి యోహాన్, ఎంపీడీవో సంతోష్ రెడ్డి, తహసిల్దార్ సురేష్, మెడికల్ ఆఫీసర్ నరసింహస్వామి, కమ్మర్ పల్లి సొసైటీ చైర్మన్ రేగుంట దేవేందర్, ఎంపీటీసీ మైలారం సుధాకర్, ఉపసర్పంచ్ పాలెపు చిన్న గంగారం, బషీరాబాద్ సర్పంచ్ సకారం అశోక్, ఎంపీఓ శ్రీనివాస్‌గౌడ్, ఆరోగ్య విస్తరణ అధికారి మహేందర్, ఏపిఎం కుంట గంగారెడ్డి, పంచాయతీ కార్యదర్శి శాంతి కుమార్, మండల అధికారులు, ఆరోగ్యశాఖ సిబ్బంది, ఐకెపి, అంగన్వాడి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


ధర్పల్లి మండలంలో..


కమ్మర్‌పల్లిలో మాట్లాడుతున్న ఎంపీపీ

ఏర్గట్ల:మండలకేంద్రంలోని రైతువేదికలో కంటివెలుగు శిబిరం ప్రారంభించారు. మొదటి రోజు కంటి వైద్యులు 49 మంది పురుషులకు, 51మంది స్త్రీలకు కంటి పరీక్షలు చేసి మందులు అందించారు.కార్యక్రమంలో ఎంపీపీ ఉపేందర్ రెడ్డి, జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్, సర్పంచ్ గుల్లే లావణ్య గంగాధర్, ఎంపీటీసీ జక్కని మధుసూదన్, టీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు తుపాకుల శ్రీనివాస్, తహసీల్దార్ జనార్దన్, ఎంపీడీఓ రాజేశం, ఎంపిఓ శివ చరణ్, పంచాయతీ కార్యదర్శి జాకీర్, మెడికల్ ఆఫీసర్ ప్రసన్న ప్రియ తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి:మండలంలోని మునిపల్లి, జక్రంపల్లి గ్రామ పంచాయతి పరిధిలోకంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీ కుంచాల విమల రాజు ప్రారంభించారు. వైస్ ఎంపీపీ ముస్కు తిరుపతి రెడ్డి, జక్రాన్‌పల్లి సర్పంచ్ చంద్రకళ బాలకిషన్, మునిపల్లి సర్పంచ్ సాయిరెడ్డి, ఉపసర్పంచ్ ఎంపీటీసీలు, ఎంపీడీవో లక్ష్మణ్, పంచాయతీ సెక్రెటరీలు నరేష్, గౌతమి, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్మూర్ :కంటి వెలుగు కార్యక్రమానికి 33, 1, 4 వార్డుల్లో కేంద్రాలను మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినిత పవన్ గురువారం ప్రారంభించారు. కంటి సమస్య ఉన్నవారు కేంద్రాలకు వచ్చి ఉచితంగా కళ్లద్దాలు, సరిపడు మందులు, మందులు తీసుకొని కంటి సమస్యను పరిష్కరించాలని సూచించడం జరిగింది. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మున్ను భాయ్, మున్సిపల్ స్థానిక కౌన్సిలర్లు, ఇట్టెడి నర్సారెడ్డి, టీఆర్ఎస్ సీనియర్ నాయకులు, ఆరోగ్యశాఖ అధికారులు, మున్సిపల్ అధికారులు, పోలీస్ శాఖ, మహిళా సంఘాల ఆర్పీలు, మహిళా అధ్యక్షులు, సిస్టర్స్, ఆశా వర్కర్లు, వార్డు ఆఫీసర్లు, అంగన్ వాడి టీచర్స్ పాల్గొన్నారు.

భీంగల్: మండలంలోని బెజ్జోరలో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని మండల ప్రత్యేకాధికారి దుర్గప్రసాద్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. శిబిరానికి వచ్చే వారికి అన్ని సౌకర్యాలు కల్పించాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. ఈయన వెంట సర్పచ్ కోగూరు ప్రతిభసుమన్, యంపిటీసి నర్సయ్య, ఎంపిడివో రాజేశ్వర్, డాక్టర్ అజయ్‌పవర్, అప్తాల్మిక్ ప్రతాప్, ఎంపివో గంగమోహన్, ఏపీఎం కుంట శ్రీనివాస్, పార్మాసిష్టు లక్ష్మణ్ తదితరులున్నారు.

మోపాల్:మండలంలోని న్యాల్కల్, ముదక్ పల్లీ గ్రామపంచాయతీ కార్యాలయంలో కంటి వెలుగు శిబిరాలు ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లత, మండల్ స్పెషల్ ఆఫీసర్ సంజీవ్, ఎంపీడీవో లింగం, ఎంపీపీ లత కన్నీరాం జడ్పీటీసీ కమల నరేష్, ఎంపీఓ ఇక్బాల్, సర్పంచులు గంగా ప్రసాద్, సుజాత పాల్గొన్నారు.

డిచ్‌పల్లి:ఇందల్ వాయి ప్రభుత్వ ఆస్పత్రి పరిధిలోని డిచ్‌పల్లి మండలంలోని ధర్మారం బీ, బీబీపూర్, గొల్లపల్లి గ్రామలలో సర్పంచులు మమత ఆనంద్, మోహన్, లింగం యాదవ్, ఎంపిడిఓ గోపి బాబు వైద్య సిబ్బందితో కలిసి కంటిశిబిరం ప్రారంభించారు. ఆశా కార్యకర్తలు ఇంటింటికి తిరిగి కంటి సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి కంటి పరీక్ష శిబిరానికి రప్పించారు. కంటి పరీక్షలు చేసి మోతి బిందు శస్త్ర చికిత్స అవసరమైన వారికి జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో ఇందల్‌వాయి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సంతోష్ కుమార్, మండల ఆరోగ్య విస్తరణాధికారి వైశంకర్, క్యాంప్ ఆఫీసర్ వరలక్ష్మి, పాల్గొన్నారు.


భీంగల్: బెజ్జోరలో..


ఏర్గట్లలో..


డిచ్‌పల్లి మండలంలో..


మాక్లూర్ మండలంలో..


మోపాల్ మండలంలో..


జక్రాన్‌పల్లి మండలంలో...


నిజామాబాద్ రూరల్ మండలంలో..

పంటలు పరిశీలన

నవతెలంగాణ-మెండోర


పంటల నమోదు పరిశీలిస్తున్న అధికారి

మండలంలోని వెల్లటూర్ గ్రామంలో జిల్లా వ్యవసాయ అధికారి రాయుడు తిరుమల ప్రసాద్ గురువారం పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి రాజ్ కుమార్ సమక్షంలో పసుపు, వరి తదితర పంటలను పరిశీలించారు.పంటల సాగు నమోదు వివరాలు పరిశీలించారు. రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను వ్యవసాయ విస్తీర్ణాధికారులు సర్వేనెంబర్ వారిగ పక్కాగా నమోదు చేయాలని సూచించారు. వరిలో సస్య రక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. వరిలో అక్కడక్కడ మొగి పురుగు ఆశిస్తుందని, దీని నిర్మూలనకు నాట్లు వేసిన తర్వాత 20 రోజుల్లోపు 8 కేజీల 4జి గుళికలను లేదా క్లోరాంట్రో నిలిప్రోలే గుళికలను ఎకరానికి 5 కేజీల చొప్పున చల్లుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజ్ కుమార్ , ఎఈఓ రాజేశ్వర్ , రైతులు పాల్గొన్నారు.

22న పౌరహక్కుల సంఘం జిల్లా మహాసభ


మహాసభల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-కంఠేశ్వర్

పౌర హక్కుల సంఘం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా16వ మహాసభ ఈనెల 22న నిజామాబాద్ నగరంలోని ప్రెస్‌క్లబ్, పాత కలెక్టరేట్ ఎదుట నిర్వహిస్తున్నట్టు నిజామాబాద్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు మువ్వ నాగేశ్వరరావు, పౌర హక్కుల సంఘం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి వాల్గో రవీందర్ తెలిపారు. ఈ మేరకు మా సభకు సంబంధించిన కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రొఫెసర్ కే.వై రత్నం, సెంట్రల్ యూనివర్సిటీ ఈ సభలో ప్రసంగిస్తారని తెలిపారు. రాజ్యాంగం, చట్టాల ద్వారా మానవునికి హక్కులు సంక్రమించాయని, ప్రభుత్వాలు వీటిని గౌరవించడం లేదని అన్నారు. కార్పొరేట్ కంపెనీలకు ఏజెంట్‌గా పనిచేస్తూ ప్రజల జీవించే హక్కును, చట్టాలను ఈ ప్రభుత్వాలే ఉల్లంఘిస్తుంటే న్యాయస్థానాలు కళ్ళప్పగించి చూస్తున్నాయని తెలిపారు. ప్రజల మధ్య కుల, మతోన్మాద చిచ్చు పెట్టి చలి మంటలు కాచుకుంటుందని అన్నారు. సహజ వనరులను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెడుతన్నాయని తెలిపారు. వీటన్నింటిని సమీక్షించుకుని, భవిష్యత్ కార్యాచరణ రూపొందించడానికి జరుగుతున్న ఈ మహాసభలో ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, మేదావులు, ప్రజా సంఘాలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

క్రీడల్లో ప్రవేశాలకు ఎంపికలు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

భారత క్రీడా ప్రాధికార సంస్థ వారి ఆధ్వర్యంలో 2023-2024 సంవత్సరానికి ప్రవేశానికి క్రీడలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా క్రీడా అధికారి ముత్తన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా అంశాల్లో భారత క్రీడా ప్రాధికార సంస్థ, రాష్ట్ర స్థాయి ఖేలో ఇండియా సెంటర్ ప్రవేశానికి ఎంపికలు ఈనెల 31, ఫిబ్రవరి 1 న నిర్వహించనున్నారని తెలిపారు. ఈ ఎంపికలో 12 నుంచి 18 సంవత్సరాల వయసు గల బాలబాలికలకు ఎంపికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ ఎంపికలు హైదరాబాద్ లోని జి.యం.సి. బాలయోగి స్టేడియం సరూర్ నగర్ లో ఆర్చరీ లో బాలికలు, అథ్లెటిక్ లో బాలురు, బాలికలకు నాన్ రెసిడెన్షియల్ వారు, హాకీ లో బాలురు, బాలికలకు రెసిడెన్షియల్ వారు, కబడ్డీ లో బాలురు రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్ వారు అలాగే హైదరాబాద్‌లోని ఇండోర్ స్టేడియం యల్‌బి నగర్‌లో జిమ్నాస్టిక్ బాలురు, బాలికలకు నాన్ రెసిడెన్షియల్ వారికి నిర్వహిస్తారని అన్నారు.

పురుగుల మందు తాగి ఉపాధ్యాయుడు ఆత్మహత్య

నవతెలంగాణ-మాక్లూర్


ఉపాధ్యాయుని మృతదేహం

మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన బొజ్జ శ్రీధర్ పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై యాదగిరి గౌడ్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. కొత్తపల్లి గ్రామానికి చెందిన బొజ్జ శ్రీధర్(48) నందిపేట్ మండలంలోని కుద్వాన్‌పూర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సాంఘికశాస్త్రం ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్నారు. షేర్ మార్కెట్‌లో డబ్బులు పెట్టడంతో అప్పులు కావడ వల్ల బుధవారం రాత్రి పురుగుల మందు తాగాడని తెలిపారు. స్థానికులు గమనించి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుని తండ్రి కోటేశ్వర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. సూసైడ్ నోట్‌లో మామ సాంబశివరావు, బావమరిది కళ్యాణ్ చక్రవర్తి వల్లే ఆత్మహత్య చేసుకున్నట్లు రాసుకున్నాడని తెలిపారు.

కోటపాటికి బెదిరింపు కాల్స్

నవతెలంగాణ-ఆర్మూర్

గత నెల 30న కోటపాటి నరసింహనాయుడును చంపుతామని కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి బెదిరించారని, దానిపై వెంటనే పట్టణ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినప్పటికీ ఇంతవరకు చర్యలు తీసుకోలేదని ఆయన తెలిపారు. తాజాగా బుధవారం రాత్రి బెదిరిస్తూ కాల్స్ చేశారని చెప్పారు. తమకు రక్షణ కల్పించి బెదిరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్టేషన్ హౌస్ ఆఫీసర్ సురేష్ బాబుకు గురువారం ఫిర్యాదు చేశారు. ఏసీపీ సీపీలకు ఫిర్యాదు కాపీలు పంపించారు. ఇప్పటికైనా బెదిరించిన వారిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

చిరుతపులి వేలిముద్రలు కావు

ఆర్మూర్ ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్రీనివాస్ వెల్లడి

నవతెలంగాణ-ఆర్మూర్

నూతన డొంకేశ్వర్ మండలంలోని అన్నారం గ్రామ పరిసర ప్రాంతాల్లో చిరుత పులి సంచరిస్తుందని కొందరు యువకులు వీడియోలు తీసి సోషల్ మీడియాలో వైరల్ చేశారని, అది చిరుత పులి కాదని, ప్రజలు భయాందోళన చెందవద్దని ఆర్మూర్ ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్రీనివాస్ గురువారం తెలిపారు. చిరుతపులి పాదాల ముద్రలు కనీసం 10 సెంటీమీటర్ల నుండి 15 సెంటీమీటర్ల పైన ఉంటాయని, ఇక్కడ 7 సెంటీమీటర్ల పాదముద్రలతో పాటు గోర్లు కనిపిస్తున్నాయని అన్నారు. ఏదైనా డాగ్ ఫ్యామిలీకి సంబంధించిన అటవీ జంతువు అని తెలిపారు. అన్నారం, సిర్పూర్ పరిసర ప్రాంతాల్లోని ప్రజలు భయాందోళనకు గురి కావద్దని అన్నారు. గ్రామంలోని మాసం చెరువు, పటేల్ చెరువు వ్యవసాయ పంట పొలాల్లో పలుచోట్ల చిరుత పులి పాదముద్రలు సేకరించామని తెలిపారు.

మామిడిపల్లి పాఠశాలలో అవగాహన



నవతెలంగాణ-ఆర్మూర్

జాతీయ బాలిక దినోత్సవ వారోత్సవాల సందర్భంగా పట్టణంలోని మామిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోషక ఆహారం, విద్య ప్రాధాన్యత, బాల్య వివాహాలు చేయకూడదని బాలికలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ శ్రీదేవి, ప్రాథనోపాధ్యాయులు గంగారం, ఉపాధ్యాయ బృందం అంగన్వాడి టీచర్లు జగదాంబ, శైలజ సంగీత, గోదావరి లక్ష్మీ, రజిని ,పద్మ తదితరులు పాల్గొన్నారు.

కోళ్ల పందెం స్థావరంపై దాడి

- రూ.6700స్వాధీనం

నవతెలంగాణ-వర్ని

మండలంలోని సంకోరా గ్రామ శివారులో కొనసాగుతున్న కోళ్ల పందెం స్థావరంపై గురువారం ఎస్ఐ అనిల్ రెడ్డి బృందం పక్క సమాచారంతో దాడి చేశారు. పందెం ఆట గాళ్లను నలుగురిని పట్టుకొన్నారు. వారి నుంచి 6700 రూపాయలు స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

నవతెలంగాణ-భీంగల్


ఆర్థికసాయం అందజేస్తున్న ఉపాధ్యాయులు

మండలంలోని జాగిర్యాల్ ఉన్నత సాఠశాలలో పీటీఎఫ్‌గా పనిచేసి ఇటివలే గుండెపోటుతో మృతిచెందిన లక్ష్మీనారాయణ కుటుంబానికి ఉపాధ్యాయులు ఆర్థికసాయం అంద జేశారు. పట్టణంలోని ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకర్ ఉపాధ్యాయులు 10 వేల రూపాయలు, బాలికల ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయుడు రఘువాస్, ఉపాధ్యాయులు 8700 రూపాయలను మృతుని భార్యకు గురువారం అంద'జేశారు. కార్యక్రమంలో ఎంఈఓ స్వామి, ఉపాధ్యా యులు ఉన్నారు.

ఎమ్మెల్యే సారూ.. ఆదుకోండి

- దళిత నాయకుడు నక్క నర్సయ్య

నవతెలంగాణ-ఆర్మూర్


మాట్లాడుతున్న దళిత నాయకుడు

బతకనిస్తలేరు మీరే దిక్కు.. ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సారూ.. ఆదుకోండి అంటూ దళిత నాయకుడు నక్క నర్సయ్య వేడుకున్నారు. గురువారం ఆయన మున్సిపల్ కార్యాలయం ముందు మీడియా ఎదుట తన గోడును వెళ్లబోసుకున్నాడు. పట్టణ కేంద్రంలో వెంకటేశ్వర కాలనీలో నిర్మిస్తున్న షెల్టర్ల నిర్మాణానికి అనుమతులు ఉన్నాయని బాధితుడు దళిత నాయకుడు అన్నారు. మున్సిపల్ అధికారులు నిర్మాణ పనులను పరిశీలించి గతంలో ఉన్న కమిషనర్ ఇచ్చిన అనుమతులు చెల్లవని బుధవారం ఉదయం జెసిబితో నిర్మాణాలను కూలగొట్టారన్నారు. కాలనీలోని ముగ్గురు వ్యక్తులు కక్షపూరితతగా వ్యవహరిస్తూ టార్గెట్ చేశారని వాపోయారు. దళితుడు తమ మధ్యలో ఉండకూడదని ఇలా చేస్తున్నారని అన్నారు. మున్సిపల్ అధికారులు ఇచ్చిన అనుమతుల ప్రకారంగా తాను షెల్టర్ నిర్మాణ పనులను కొనసాగిస్తున్నానని తెలిపారు. ప్రభుత్వ అధికారులు తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. తనపై క్షక్ష కట్టిన వ్యక్తుల పై చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

డ్రైనేజీ పనులను ప్రారంభించిన సర్పంచ్

నవతెలంగాణ-రెంజల్



మండలంలోని దూపల్లి గ్రామంలో సర్పంచ్ సాయిరెడ్డి డ్రయినేజీ పనులను గురువారం ప్రారంభించారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి మూడు లక్షల రూపాయల వ్యయంతో ఈ పనులను ప్రారంభించినట్టు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మొగులాబాయి, ఉప సర్పంచ్ కంచె సాయిలు, గ్రామ కార్యదర్శి సీహెచ్ సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆలోచనల ఆయుధం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

కామారెడ్డి

3

శుక్రవారం 20 జనవరి 2023

స్పీకర్‌ను సన్మానించిన విశ్వబ్రాహ్మణులు

నవతెలంగాణ-వర్ని



మోస్రా మండల కేంద్రానికి చెందిన విశ్వబ్రాహ్మణుల సంఘానికి నిధులు మంజూరు చేసినందుకు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి మంజూరు చేయటంతో మోస్రా మండల విశ్వ బ్రాహ్మణులు రైతు సమన్వయ సమితి అధ్యక్షులు పిట్ల శ్రీరామ్ ఆధ్వర్యంలో బాన్సువాడలో స్పీకర్ నివాసంలో గురువారం ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. తమ సంఘానికి నిధులు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి అధ్యక్షులు పిట్ల శ్రీరాములు, విశ్వబ్రాహ్మణ కుల సంఘాల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం

నవతెలంగాణ-రామారెడ్డి

బాధిత కుటుంబాలకు బాసటగా నారెడ్డి స్వచ్ఛంద సంస్థ ద్వారా జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి ఆర్థిక సహాయాన్ని గురువారం అందజేశారు. మండలంలోని ఉప్పల్వాయి గ్రామానికి చెందిన మంగలి రామచంద్ర, పురం బాలయ్య, తుమ్మల రాములు ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాలకు సానుభూతిని తెలిపి, నారెడ్డి స్వచ్ఛంద సంస్థ ద్వారా ఆర్థిక సహాయాన్ని అందజేసి, ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఎన్నం రాములు, కుమ్మరి శంకర్, జూకంటి నారాయణ, రాజు, పరువయ్య రాము, ఆకుల లింగం తదితరులు పాల్గొన్నారు.

పండరిపూర్‌కు పాదయాత్రగా వెళ్లిన పలువురు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండలంలోని వడ్లం గ్రామానికి చెందిన విట్టలేశ్వర్ భక్తులు 50 మంది పాదయాత్ర ద్వారా గురువారం బయలుదేరినట్టు తెలిపారు. భజన మండలి భక్తులు గ్రామంలో ఉన్న హనుమాన్ ఆలయానికి చేరుకొని కొబ్బరి కాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించినట్టు తెలిపారు. అనంతరం అధ్యక్షులు మాట్లాడుతూ.. మల్లూర్ గ్రామం నుంచి వెళ్తున్న దిండితో కలసి పండరిపూర్‌కు పాదయాత్రగా వెళ్లి విటలేశ్వరుని దర్శనం చేసుకొని మొక్కులు తీర్చుకుంటామని ఆయన తెలిపారు.

పాఠశాల వంట రూమును పరిశీలించిన ఎంపీడీవో

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని బోర్గాం గ్రామంలో మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా నిర్మిస్తున్న వంట రూమును ఎంపీడీవో శంకర్ గురువారం పరిశీలించారు. 16లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న ఇట్టి పనులను నాణ్యతతో నిర్మించాలని ఆయన కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆయన వెంట స్థానిక నాయకులు మేక సంతోష్, సూపరిండెంటెంట్ శ్రీనివాస్, పుట్టి నడిపి నాగన్న, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి

నవతెలంగాణ - రెబ్బెన

బెల్లంపల్లి ఏరియా ఖైరిగూడ ఓసీలో పనిచేస్తున్న ఉద్యోగులకు సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్ అమలుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనికి డీఎం(సేఫ్టీ) బెల్లంపల్లి రీజియన్ జాన్ ఆనంద్ హాజరై మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి ఇంటి నుండి బయటకు వెళ్లడం, విధులు ముగించుకొని తిరిగి ఇంటిలో అడుగుపెట్టే వరకు రక్షణ సూత్రాలను పాటించాలన్నారు. ప్రతి ఉద్యోగి రోడ్డుపై వెళ్లేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు, గనిలో సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్ నిబంధనను పాటిస్తే ప్రమాదాలు లేని సంస్థగా సింగరేణి నిలుస్తుందని పేర్కొన్నారు. ఎస్ఎంటీటీ ఎస్ఓఎం ఈపీఎస్ విజయ్‌కుమార్ మేనేజ్‌మెంట్ ప్లాన్ అమలుపై ఉద్యోగులకు ప్రొజెక్టర్ ద్వారా రక్షణతో చేసే పనులపై అవగాహన కల్పించారు. పలు దేశాల్లో పాటిస్తున్న రక్షణ సూత్రాలు, పద్ధతులను క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జీఎం కెహెచ్ఎన్ గుప్తా, ఏజీఎం ఎం తిరుమలరావు, ప్రాజెక్టు అధికారి ఉమాకాంత్, సేఫ్టీ అధికారి రాజేశ్వర్‌రావు, ఇన్‌చార్జి ప్రాజెక్టు ఇంజనీర్ నరేష్, ఫిట్ కార్యదర్శి వెంకటేశ్, సీనియర్ పర్సనల్ అధికారి వేణు పాల్గొన్నారు.

వరల్డ్ విజన్ సేవలు ప్రశంసనీయం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

వరల్డ్ విజన్ సేవలు ప్రశంసనీయమని డీఈఓ రవీందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కేజీబీవీలో వరల్డ్ విజన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థినులకు ఐకాన్ స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. మండలంలోని ఏడు ఉన్నత పాఠశాలలు, ఒక కేజీబీవీ పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు రూ.50వేల విలువ చేసే స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ అడ్వాల పద్మరమేష్, జడ్పీటీసీ ఓస రాజేశ్వర్ మాట్లాడుతూ వరల్డ్ విజన్ స్వచ్ఛంద సంస్థ సేవలు అమూల్యమైనవని పేర్కొన్నారు. మండల విద్యాధికారి మధుసూదన్, మండలంలోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీ ప్రిన్సిపాల్ నవిత పాల్గొన్నారు.

ఐక్య గురుకులాల రాష్ట్ర అధ్యక్షుడిగా దూలం ఎల్లయ్య

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈనెల 13,14 వ తేదీలలో రంగారెడ్డి జిల్లా మన్నెగూడలో జరిగిన రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభల్లో ఐక్య గురుకులాల రాష్ట్ర అధ్యక్షుడిగా సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, ఆసిఫాబాద్ ఉపాధ్యాయుడు దూలం ఎల్లయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నిక పట్ల జిల్లా అధ్యక్ష కార్యదర్శి శాంతకుమారి, ఇందు రావు, జిల్లా ఐక్య గురుకులాల కన్వీనర్లు నరేందర్, వినోద్, శ్యామ్, శిరీష, మండల యూటీఎఫ్ అధ్యక్షులు ఉపేందర్ సింగతి అభినందించారు.

ప్రజా కవి వేమన జయంతి

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలో సామాజిక చైతన్య వేదిక ఆధ్వర్యంలో ప్రజా కవి వేమన జయంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా కాసిపేట మండల కవి గొల్లపల్లి బ్రహ్మయ్యను శాలువాలతో సన్మానం చేశారు. కార్యక్రమంలో ఆ వేదిక అధ్యక్షుడు పల్లె మల్లయ్య ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాపు, సిలోజ్ మురళి, గోనెల శ్రీనివాస్, చిన్న భీమయ్య, సీహెచ్ ప్రభాకర్, ఆయిల్ల రాజం, కుర్మ నర్సయ్య పాల్గొన్నారు.

108, 102 సేవల పరిశీలన

నవతెలంగాణ-కాసిపేట

కాసిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని 108, 102 అంబులెన్సు సేవలను 108, 102 ప్రోగ్రాం మేనేజర్ సాగ్రాట్ పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేశారు. దీంతో పాటు 102 సర్వీసులను స్థానిక వైద్య పరీక్షలకు వినియోగించుకోవాలని సూచించారు. పలు అంశాలపై సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో 108, 102 ప్రోగ్రాం ఈఎంఇ కౌండల్, ఎస్సీ జనార్ధన్ పాల్గొన్నారు.

జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-కుభీర్

జీవితంపై విరక్తి చెంది వాయిలింగి గ్రామానికి చెందిన కదం మారుతి(38) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కొంత కాలం నుంచి పనీపాట లేకుండా ఖాళీగా తిరుగుతున్నాడు. ఈ క్రమంలోనే మద్యానికి బానిసయ్యాడు. బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేనిది చూసి భార్య చీరతో దూలానికి ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే భైంసా ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేయగా అప్పటికే మృతి చెందాడు. భార్య సత్యశీల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ షరీఫ్ తెలిపారు.

కంటిచూపుతో ఏ ఒక్కరూ బాధపడొద్దు

- ఎమ్మెల్యే హన్మంత్‌షిండే
- కంటి వెలుగు దేశానికే అదర్శం..
- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజల సురేందర్
- కంటి వెలుగుతో నిరుపేదల జీవితాల్లో వెలుగులు
- బోధన్ ఎమ్మెల్యే షకీల్
- పలుచోట్ల కంటివెలుగు శిబిరాలు ప్రారంభం



ఎల్లారెడ్డి : మాట్లాడుతున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే



బిచ్కుంద : మాట్లాడుతున్న జుక్కల్ ఎమ్మెల్యే

నవతెలంగాణ-విలేకరుల బృందం

బిచ్కుంద : తెలంగాణ రాష్ట్రంలో పేద కుటుంబాలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం ఉంటుందని, కంటిచూపుతో ఏ ఒక్కరూ బాధపడొద్దు అని ముఖ్యమంత్రి కేసీఆర్ ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచిత కళ్ళజోడుతో పాటు ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్టు జుక్కల్ ప్యానల్ స్పీకర్, శాసనసభ్యులు హన్మంత్ షిండే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండవ విడత ఉచిత కంటి వెలుగు కార్యక్రమాన్ని మండలంలోని పుల్కల్ గ్రామంలో అసెంబ్లీ జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే హనుమంత్ షిండే మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు ఈ ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ అశోక్ పటేల్, ఆర్డీవో రాజాగౌడ్, సొసైటీ సహకార సంఘం చైర్మన్ నాల్చారు బాలాజీ, తహసీల్దార్ రవికాంత్, ఎంపీడీవో ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి : కంటి వెలుగు కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. గురువారం ఎల్లారెడ్డి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా అదనపు కలెక్టర్, ఆర్‌డీఓ, తదితరులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జాజాల సురేందర్ మాట్లాడుతూ.. సంపూర్ణ ఆరోగ్య తెలంగాణ కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. అంధత్వ రహిత తెలంగాణ దిశగా సీఎం కేసీఆర్, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు నిరంతరం కృషి చేస్తున్నారని ఆయన కొనియాడారు. అలాగే భారతదేశంలో ఏ రాష్ట్రంలో లేని పలు సంక్షేమ, అభివృద్ధి పథకాలను తెలంగాణలో అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దేనని ఆయన ప్రశంసించారు. అదేవిధంగా కల్యాణి, అజమాబాద్ గ్రామాల్లో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీ మాధవి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఆర్డీవో శ్రీనివాస్ నాయక్, ఎంపీపీ మాధవి బాలరాజుగౌడ్, మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, జడ్పీటీసీలు ఉషగౌడ్, మనోహర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కాశీ నారాయణ, డిప్యూటీ డీఎంహెచ్ఓ శోభారాణి, ఎల్లారెడ్డి సీహెచ్‌సీ సూపరింటెండెంట్ రవీంద్ర మోహన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, ఆయా మండలాల ప్రజాప్రతినిధులు, సర్పంచులు, వైద్యశాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గాంధారి : పాటో మండల కేంద్రంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెండవవిడత కంటివెలుగు కార్యక్రమాన్ని జడ్పీటీసీ శంకర్‌నాయక్‌తో కలిసి గాంధారి సర్పంచ్ మమ్మాయి సంజీవ్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సంజీవ్ మాట్లాడుతూ.. కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్‌చైర్మన్ రెడ్డిరాజు, తహసీల్దార్ గోవర్ధన్, ఎంపీటీసీ సభ్యులు పత్తి శ్రీనివాస్, కోఆప్షన్ మెంబర్ ముస్తప్ప, ఉప సర్పంచ్ కొమ్ముల రమేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని చెన్నపూర్ గ్రామంలో స్థానిక ప్రజాప్రతినిధులు ఏఎంసీ చైర్మెన్ సత్యంరావుతో కలిసి సర్పంచ్ గీత శ్రీకాంత్‌రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో గండివేట్ సర్పంచ్ ఫరూక్, మేడిపల్లి సర్పంచ్ నారాయణ, సీతాయిపల్లి సర్పంచ్ రాజమణిరాజు, ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ : కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ శారదా నాగరాజు, జడ్పీటీసీ తీర్మల్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని బాలుర పాఠశాలలో కంటి వెలుగు కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కానుగంటి శారద నాగరజు మాట్లాడుతూ..

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యాక్రమాన్ని గ్రామాల్లో ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, ఎంపీడీవో చిన్నారెడ్డి, మండల అధ్యక్షులు మధుసూదన్ రావు, సర్పంచ్ అంజలి, వైస్ ఎంపీపీ బాపురెడ్డి, ఎంపీవో తిరుపతి, ఎంపీటీసీలు కడారి రమేశ్, నిమ్మ శంకర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పిట్లం : కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కవిత విజయ్ అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి భరత్, తహసీల్దార్ రామ్మోహన్‌రావు, డాక్టర్ శివకుమార్, సర్పంచ్ బీరప్ప, ఎంపీటీసీ హన్మాండ్లు, అంగన్వాడీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఎడపల్లి : మండలంలోని కుర్నాపల్లి, ఎడపల్లి గ్రామాల్లో కంటి వెలుగు కార్యక్రమాన్ని పలువురు ప్రజాప్రతినిధులు ప్రారంభించారు.

కంటి వెలుగు.. దేశానికే ఆదర్శం..

భిక్కనూర్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కంటి వెలుగు పథకం దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని ప్రజాప్రతినిధులు, అధికారులు అన్నారు. మండలంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భిక్కనూర్ పెద్ద మల్లారెడ్డి, అంతంపల్లి గ్రామాలలో కంటి వెలుగు పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు మాట్లాడుతూ.. ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని గుర్తు చేశారు. గ్రామాలలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కంటి వ్యాధితో బాధపడుతున్న వారికి శిబిరంలో ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గాల్‌రెడ్డి, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సహకార బ్యాంకు డైరెక్టర్ లింగాల కిష్టాగౌడ్, ఆత్మ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, జెడ్పీటీసీ పద్మ నాగభూషణంగౌడ్, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షులు మధుమోహన్‌రెడ్డి, సర్పంచులు తునికి వేణు, లక్ష్మీ రాజలింగం, మార్కెట్ కమిటీ చైర్మన్ భగవంత్‌రెడ్డి, వైస్ చైర్మన్ హనుమంతరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు బండి చంద్రకళ రాములు, సువర్ణ ప్రభాకర్, బాబు, మంజుల సంజీవరెడ్డి, సాయగౌడ్, మంజుల రాములు మండల అభివృద్ధి అధికారి అనంతరావు, మండల పంచాయతీ అధికారి ప్రవీణ్ కుమార్, ప్రాథమిక వైద్యులు ఆదర్శ్, హేమీమా, వైద్య సిబ్బంది, ఆయాగ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

రెంజల్ : మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ వినయ్‌కుమార్ నేటి నుంచి జరిగే కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా ఆటో రిటక్టర్‌ను పరిశీలించారు. కంటి పరీక్షల అనంతరం వారికి కంటి అద్దాలను అందజేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు. కంటి వెలుగు 2 కార్యక్రమం ఏర్పాట్లు అన్ని పూర్తి చేసినట్టు ఆయన పేర్కొన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు2 కార్యక్రమాన్ని సర్పంచ్ ఎమ్మెస్ రమేష్ కుమార్, ఎంపీపీ రజని కిషోర్, జడ్పీటీసీ మేక విజయ సంతోష్ ప్రారంభించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కార్యక్రమం 100 రోజుల పాటు కొనసాగుతుందని డాక్టర్ వినయ్ కుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్, ఎంపీఓ గౌసుద్దీన్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, డాక్టర్ వినయ్‌కుమార్, స్థానిక నాయకులు రఫిక్, సంతోష్, కిషోర్, కరిపె రవీందర్, శ్రావణ్ కుమార్, సూపర్‌వైజర్ మాలంబి, పీహెచ్ఎన్ రాణి, ఐకేపీ సిబ్బంది, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంధత్వ నిర్మూలన దిశగా రాష్ట్రం : ఎంపీపీ దశరథ్ రెడ్డి..

రామారెడ్డి : అంధత్వ నిర్మూలన దిశగా రాష్ట్రం పయనించాలని తపనతో ముఖ్యమంత్రి కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టారని స్థానిక ఎంపీపీ నారెడ్డి దశరథ్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని అన్నారం, రామారెడ్డి పీహెచ్‌సీలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచులు దండ బోయిన సంజీవ్, కూడెల్లి అమృత బాలరాజ్, ఉప సర్పంచ్లు శ్రీనివాస్‌రెడ్డి, ప్రసాద్, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు రంగు రవీందర్‌గౌడ్, మండల రైతు సమన్వయ కమిటీ అధ్యక్షులు నారాయణరెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు రాజాగౌడ్, ఎంపీటీసీలు రజిత రాజేందర్‌గౌడ్, చంద్రకళ గంగారెడ్డి, ఎంపీడీవో విజయ్‌కుమార్, ఎంపీఓ సవితారెడ్డి, టీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బుచ్చిరెడ్డి, వైద్యులు సురేష్, హరీష్‌గౌడ్, మమత, సిబ్బంది భీం, దోమల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట్ : మండలంలోని కొండాపూర్ గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ స్వాతి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కంటి వెలుగు కార్యక్రమం ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ లింగాల స్వరూప, జడ్పీటీసీ కొండ హనుమాన్లు, రైతుబంధు మండల అధ్యక్షుడు జూకంటి మోహన్‌రెడ్డి, ఎంపీడీవో బాలకిషన్, తహసీల్దార్ శాంత, డాక్టర్ సంధ్య, వార్డ్ మెంబర్ కిషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జడ్పీటీసీ కమిలి నర్సింలు అన్నారు. మండలంలోని అమర్లబండ గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. మొదటగా అమర్లబండ గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గైని అనసూయ, తహసీల్దార్ కె.ధన్వాల్, డీఎంఅండ్‌హెచ్ఓ లక్ష్మణ్ సింగ్, సర్పంచ్ కొత్తూరి లతారాజేశ్వర్, ఇంచార్జ్



బోధన్ : కంటి పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే



గాంధారిలో..

ఎంపీడీవో సురేందర్ రెడ్డి, డా.ఆస్మాఅఫ్రీన్, డా.శిరీష, సీహెచ్ఓ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి : మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలో రెండో విడత కంటి వెలుగు శిబిరాన్ని జెడ్పీటీసీ శంకర్ పటేల్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కంటి వెలుగు శిబిరాన్ని కోటగిరి గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కంటి వెలుగు శిబిరంలో చూయించుకున్న వారికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ లక్ష్మణ్, వైస్ ఎంపీపీ గంగాధర్ పటేల్, కోఆప్షన్‌మెంబర్ సిరాజ్, ఏఎంసీ చైర్మన్ అబ్దుల్ హమీద్, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు, అధ్యక్షులు అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట్ : అంధాకారం లోపం ఉన్నవారు కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని లింగంపేట్ జెడ్పీటీసీ సభ్యురాలు ఏలేటి శ్రీలత సంతోష్‌రెడ్డి అన్నారు. మండలంలోని లింగంపేట్ మోతే గ్రామపంచాయతీలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రంలో ఇలాంటి పథకాన్ని చేపట్టలేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గరీబున్నిసా నయీం, ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ ఒంటరి సిద్ధారెడ్డి, ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి, సర్పంచులు బొల్లు లావణ్య, ఏలేటి రాంరెడ్డి, మండల వైద్యాధికారి హిమబిందు, కంటి వైద్యాధికారి సంగీత, అమల, ఏపీవో ప్రభాకర్‌చారి, తహసీల్దార్ మారుతి, ఏపీఎం శ్రీనివాస్, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

మోస్రాలో కంటి వెలుగును ప్రారంభించిన ఎంపీపీ..

వర్ని : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంపీపీ పిట్ల ఉమా శ్రీరాములు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుమలత రామ్‌రెడ్డి, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

బోధన్ : కంటి వెలుగు కార్యక్రమంతో ముఖ్యమంత్రి కేసీఆర్ నిరుపేదల జీవితాలలో వెలుగులు నింపుతున్నారని బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమెర్ అన్నారు. గురువారం కంటి వెలుగు రెండో విడత కార్యక్రమంలో భాగంగా ఆయన బోధన్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ రైతు వేదికలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఉపవైద్యాధికారి డాక్టర్ విద్య, బోధన్ తహసీల్దార్ వరప్రసాద్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ షకీల్, బీఆర్ఎస్ బోధన్ పట్టణ అధ్యక్షుడు రవీందర్ యాదవ్, కౌన్సిలర్లు రాధాకృష్ణ, ధూప్‌సింగ్, నాయకులు సత్యం వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాలూర మండల కేంద్రంలో గల రైతు వేదికలో బోధన్ ఎంపీపీ బుద్దె సావిత్రి కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దృష్టి లోపాలను నివారించాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కంటివెలుగు-2 కార్యక్రమాన్ని చేపట్టిందని, కావున ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సాలూర మండలం సాలూర, సాలంపాడ్ గ్రామాలలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. 18 ఏండ్లు పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరూ కంటి వెలుగు శిబిరాల్లో నేత్ర పరీక్షలు చేయించుకోవాలని కోరారు. అవసరం ఉన్నవారికి శిబిరంలోనే మందులు ఇవ్వడం, దృష్టిలోపం ఉన్నవారికి కంటి అద్దాలు అందచేస్తారని అన్నారు. కంటి వెలుగు కేంద్రాల్లో వచ్చిన వారికి అన్ని సౌకర్యాలు కల్పించాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. కార్యక్రమంలో సాలూర తహసీల్దార్ మమత, ఎంపీడీఓ మధుకర్, డాక్టర్ ప్రియాంక, టెక్నీషియన్ శ్రీనిత్య, ఏఎంసీ వైస్ చైర్మన్ సాలూర షకీల్, బోధన్ టీఆర్ఎస్ మండల అధ్యక్షులు నర్సయ్య, సర్పంచ్‌లు చంద్రకళ, ఎడపల్లి పుష్ప, ఎస్కే అమ్మీర్, చింతం నాగయ్య, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు మద్దినేని శ్రీనివాస్‌రావు, సాయిపటేల్, సహకార సంఘం చైర్మన్ అల్లె జనార్ధన్ పాల్గొన్నారు.

కంటి వెలుగును పరిశీలించిన అదనపు కలెక్టర్..

రామారెడ్డి : మండల కేంద్రంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన కంటి వెలుగు కార్యక్రమాన్ని గురువారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ ధోత్రె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు కంటి వెలుగు కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని, ప్రతి ఒక్కరిని భాగస్వామ్యం చేసి కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఆయన వెంట డీపీఓ శ్రీనివాసరావు, ఎంపీడీవో విజయ్‌కుమార్, ఎంపీఓ సవితారెడ్డి, వైద్యులు హరీష్ కుమార్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రామారెడ్డి : కంటివెలుగును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

విద్యార్థులకు బలవర్ధక పానీయాలు పంపిణీ

నవతెలంగాణ-ముప్కాల్



లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల (ఉర్దూ, తెలుగు మీడియం) విద్యార్థులకు బలవర్ధక పానీయాలు (ఫ్రూట్ జ్యూస్) పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముప్కాల్ లయన్స్‌క్లబ్ అధ్యక్షులు వెంగయ్య మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం విద్యార్థులకు ఈ పానీయాలను అందజేయడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు వెంగయ్య, జక్కుల రాము, ముస్కు రాజేశ్వర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పూసల చైతన్య వేదిక క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-ముప్కాల్



ముప్కాల్ పూసల చైతన్య వేదిక ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ముస్కు భూమేశ్వర్ రెడ్డి గురువారం ఆవిష్కరించారు. అనంతరం పూసల చైతన్య వేదిక జిల్లా ఉపాధ్యక్షులు అవాలా శ్రీధర్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పూసల చైతన్య వేదిక సంఘం మండల నాయకులు ప్రకాష్, సత్యనారాయణ, పార్టీ నాయకులు శ్రీనివాస్ గౌడ్, గైని మణి, గుమ్మడి రాజేశ్వర్ పాల్గొన్నారు.

చట్టసభల్లో వికలాంగుల రాజకీయ రిజర్వేషన్‌పై

పార్టీల వైఖరిని స్పష్టం చేయాలి

- 75 ఏండ్ల నుంచి రాజ్యాధికారానికి దూరమైనం
- వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

చట్టసభల్లో వికలాంగుల రాజకీయ రిజర్వేషన్‌పై అన్ని రాజకీయ పార్టీలు వైఖరిని స్పష్టం చేయాలని, 75 ఏండ్ల నుంచి రాజ్యాధికారానికి దూరమైన వికలాంగులకు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్ని సీట్లు ఇస్తారో ప్రధాన పార్టీల అధ్యక్షులు కేసీఆర్, రేవంత్ రెడ్డి, బండి సంజయ్‌లు స్పష్టం చేయాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని సుద్దపల్లి గ్రామంలో సంఘం జిల్లా అధ్యక్షుడు చింతం జ్ఞానేశ్వర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన నిజామాబాద్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లా నుంచే వికలాంగుల రాజ్యాధికార సాధన పోరాటం కొనసాగుతుందని అన్నారు. వికలాంగుల సామాజిక వర్గానికి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీ ఎన్ని సీట్లు ఇస్తుందో స్పష్టం చేయాలని అన్నారు. చట్టసభల్లో వికలాంగులకు రాజకీయ రిజర్వేషన్ దక్కేంతవరకు దేశంలో, రాష్ట్రంలో ఉన్న అన్ని రాజకీయ పార్టీలపై తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వికలాంగుల సంక్షేమం కోసం దళిత బంధు మాదిరి గానే 15 లక్షల రూపాయలతో వికలాంగుల బంధు పథకాన్ని తీసుకురావాలని కోరారు. వచ్చే బడ్జెట్ సమావేశాల్లోనూ వికలాంగుల సంక్షేమానికి వెయ్యి కోట్లతో ప్రత్యేక బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలని, వికలాంగులకు ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రులో ఉచిత వైద్యం అందించాలని, ఇల్లు లేని వికలాంగులందరికీ సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం 10 లక్షల ఆర్థిక సహకారం అందించాలని కోరారు. డబల్ బెడ్ రూమ్ ఇండ్లలోను వికలాంగులకు వందకు వందశాతం రిజర్వేషన్ కల్పించి పెన్షన్ వచ్చే ప్రతి వికలాంగుడికి డబల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు చింతం జ్ఞానేశ్వర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలోజిల్లా ఉపాధ్యక్షుడు నాయికిడి పోశెట్టి జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మహేష్ జిల్లా ప్రధాన కార్యదర్శి బరిడే శ్రీనివాస్ విద్యార్థి సంఘం నాయకులు ఏన్నరాజు, జక్కలువాడు శ్రీకాంత్, షేక్ అబ్దుల్ల, బద్దుల పోతన్న, ఏడ కొట్టి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గిద్ద రాజేష్

ఎయిర్‌టెల్ కేబుల్ పరిశీలన



కేబుల్ పరిశీలిస్తున్న డీఎఫ్ఓ

నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రం నుంచి చీమన్ పల్లి గ్రామం వరకు తీసుకు వెలుతున్న ఎయిర్‌టెల్ కేబుల్ మధ్యలో అటవీ ప్రాంతం నుంచి వెళుతున్నందున. జిల్లా అటవీ అధికారి (డీఎఫ్ఓ) వికాస్ మీనన్ పరిశీలించారు. గురువారం సిరికొండ మండల కేంద్రానికి విచ్చేసిన డీఎఫ్‌వో సిరికొండ నుంచి చీమన్‌పల్లి వరకు అటవీ మార్గంనుంచి ఎయిర్‌టెల్ కంపెనీకి చెందిన కేబుల్ వెళుతున్నందున డీఎఫ్ఒ తన సిబ్బందితో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ...అడవి గుండా వెళ్తున్న ఎయిర్టెల్ కేబుల్ రోడ్డు పక్కనుంచి వెళ్ళేలా చర్యలు తీసుకోవాలని అదేశించారు. ఎయిర్‌టెల్ కేబుల్ వల్ల వన్య ప్రాణులకు ఎటువంటి ప్రమాదం రాకుండా చర్యలు తీసుకోవాలని అయన తన సిబ్బందిని అదేశించినట్లు తెలిసింది. మండలకేంద్రంలోని అటవీ ప్రాంతంలో నివాసముండే వన్యప్రానులపై వేటగాళ్ల దాడులు పెరుగుతున్నందున తగు చర్యలు తీసుకోవాలని డీఎఫ్ఒ ఆదేశించినట్లు తెలిసింది. ఆయన వెంట ఆర్మూర్ డివిజనల్ అటవీ అధికారి భవాని శంకర్, సిరికొండ అటవీ రేంజ్ అధికారి వినాయక్ అటవీ సిబ్బంది ఉన్నారు.

ఇండియన్ హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్ ప్రారంభం



ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన షేక్‌మున్ను

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ బస్టాండ్ ఆవరణలో ఇండియన్ హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్ అండ్ సేల్స్‌ను పట్టణ వైస్ చైర్మన్ షేక్ మున్ను రిబ్బన్ కట్‌చేసి గురువారం ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా వైస్‌చైర్మన్ షేక్ మున్ను, టీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఖాందేష్ శ్రీనివాస్, కౌన్సిలర్ ఇంతియాజ్ అలీ విచ్చేశారు. ఇంటికి సంబంధించిన గృహెపకరణాలు, అని వస్తువులు ఓకే దగ్గర లభ్యమవడం, తక్కువ ధరలో పట్టణ ప్రజల వద్దకు చేరువ కావడం పట్ల వైస్ చైర్మన్ హర్షం వ్యక్తం చేశారు. పట్టణ పరిసర ప్రాంత ప్రజలు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకుడు ఇమ్రాన్ జాబ్రి, జాకీర్ హుస్సేన్, అజీముద్దీన్, నిజాముద్దీన్, పాష, తదితరులు పాల్గొన్నారు.

బియ్యం అవినీతిలో అధికారుల పాత్ర

- జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్

బోధన్ ఎమ్మెల్యే షకీల్, రైస్ మిల్లర్లు కలిసి చేసిన వందల కోట్ల బియ్యం కుంభకోణం అవినీతిలో జిల్లా అధికారుల పాత్ర కూడా ఉందని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి ఆరోపించారు. గురువారం నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి అధ్యక్షతన ధాన్యం సేకరణ పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అలసత్వం, రైస్‌మిల్లర్ల అవినీతి, ప్రజాధనం దుర్వినియోగంపై కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లి నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. రెండు, మూడు సంవత్సరాలుగా అధికార పార్టీ ఎమ్మెల్యే అధికార పార్టీకి సంబంధించిన రైస్ మిల్లర్లు కలిసి ప్రభుత్వానికి చెల్లించాల్సిన బియ్యాన్ని మహారాష్ట్ర వంటి పక్క రాష్ట్రాలకు అమ్ముకుంటూ తమ సొంత వ్యాపారాలకు వాడుకొని వందల కోట్ల కుంభకోణానికి పాల్పడ్డారని, అధికార పార్టీ ఎమ్మెల్యే, రైస్ మిల్లర్లు ఇంత పెద్ద అవినీతికి పాల్పడితే జిల్లా అధికార యంత్రాంగం చూసి చూడనట్టు ఉంటున్నారని విమర్శించారు. రైస్ మిల్లర్లు ధాన్యాన్ని తీసుకొని బియ్యం ఇవ్వడం లేదని, డీఎస్ఓ మాత్రం రైస్ మిల్లర్ దగ్గర బియ్యం పెండింగ్‌లో లేవని చెప్పడం అనేది రైస్ మిల్లులవారితో అధికారులు కుమ్మ క్కయ్యారని తెలు స్తుందని అన్నారు. ఈ విషయమై కలెక్టర్‌ను అడగడానికి వస్తే కలెక్టర్ లేకపోగా దౌర్జన్యంగా దాడులు చేశారని తెలిపారు. టీఆర్ఎస్ నాయకుల వైఫల్యాలను కప్పిపుచ్చేదానికి అధికార పార్టీ నాయకులు పోలీసులతో చేయిస్తున్న పని అని, జిల్లా మంత్రి, ఎమ్మెల్యేలు, అధికారులు ఈ బియ్యం కుంభకోణంలో పాత్రధారులని భావిస్తున్నామని అన్నారు. ధాన్యం కొనుగోలు చేసి తిరిగి రాబట్టడంలో అలసత్వం చూపిస్తున్న సివిల్ సప్లై డిపార్ట్‌మెంట్‌పై, ప్రభుత్వం నుంచి సేకరించిన ధాన్యాన్ని ప్రైవేటులో అమ్ముకున్న రైస్ మిల్లర్లపైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుందని మానాల మోహన్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్, పిసిసి ఉపాధ్యక్షుడు తాహెర్ బిన్ హందాన్, నగరకాంగ్రెస్ అధ్యక్షుడు కేశ వేణు, రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు అన్వేష్ రెడ్డి, జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు ముప్ప గంగారెడ్డి, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గోపి, జిల్లా యూత్ అధ్యక్షులు విక్కీ యాదవ్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు వేణురాజ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు భాగ్య, జిల్లా ఒబిసి అధ్యక్షుడు రాజా నరేందర్ గౌడ్, జిల్లా మైనారిటీ అధ్యక్షులు ఇర్ఫాన్ అలీ, పిసిసి కార్యదర్శి రామ్ భూపాల్, కార్పొరేటర్ రోహిత్, మండలాల అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ధర్నాచేస్తున్న నాయకులు

కార్మికులకు 2 వేల రూపాయల జీవోను విడుదల చేయాలి



అధికారికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-సిరికొండ

మధ్యాహ్నం భోజనం కార్మికులకు వెంటనే 2 వేల రూపాయల జీవోను విడుదల చేయాలని, మధ్యాహ్న భోజనం కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తోపునూరు చక్రపాణి అన్నారు. మార్చి 15న ముఖ్యమంత్రి మధ్యాహ్న భోజన కార్మికులకు 2000 రూపాయలు జీతం పెంచుతున్నట్లు ప్రకటించారని అది ఇంతవరకు అమలు కాలేదని తెలిపారు. కోడిగుడ్లను ప్రభుత్వమే సప్లై చేయాలని చెప్పి ఎన్నో మార్లు విన్నవించామని అన్నారు. 10 సంవత్సరాల కిందట వంట పాత్రలు ఇచ్చారని, అవి పాడైపోయాయని, వంట పాత్రలు మంజూరు చేయాలని కోరినా ప్రభుత్వానికి పట్టడంలేదని అన్నారు. వీరిని కార్మికులుగా గుర్తించి ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాద బీమా, సామాజిక బీమా ఇవ్వాలని, ఉచితంగా గ్యాస్ సప్లై చేయాలని, నాణ్యమైన బియ్యాన్ని ఇవ్వాలని కోరారు.ఈ సమస్యలపై ఆందోళన చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజనం కార్మికులు బుచ్చవ్వ, రాజనర్సు, ప్రమీల, లక్ష్మన్ వివిధ గ్రామాల నుండి కార్మికులు పాల్గొన్నారు.

పార్లమెంటులో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

ఎమ్మార్పీఎస్ నిజామాబాద్ జిల్లా కన్వీనర్ కనక ప్రమోద్



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

పార్లమెంటులో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ నిజామాబాద్ జిల్లా కన్వీనర్ కనక ప్రమోద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లు పార్లమెంట్ లో ప్రవేశ పెట్టాలని, రాష్ట్ర, జాతీయ కమిటీ మీద ఒత్తిడి తీసుకురావాలని గురువారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వ లక్ష్మి నర్సయ్యకు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి, ఎంఎంఎస్, ఎంఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా కమిటీ పక్షాన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లా కన్వీనర్ కనక ప్రమోద్ మాదిగ మాట్లాడుతూ... రానున్న పార్లమెంట్ సమావేశాల్లో బిల్లుపెట్టకపోతే మాదిగల ఆగ్రహం కట్టలు తెంచుకోక తప్పదు అని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఎమ్మార్పీఎస్ నాయకులు ఎంఎస్పి , ఎంఎంఎస్, ఎంఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ఏఐపీకేఎంఎస్ ఏకగ్రీవ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



ఎన్నికైన నూతన కమిటీ

అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐపీకేఎంఎస్) జిల్లా జనరల్ కౌన్సిల్ ఎన్ఆర్ భవన్ కోటగల్లిలో నిర్వహించారు. జనరల్ కౌన్సిల్ నూతన జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐపికెఎంఎస్) జిల్లా అధ్యక్షుడిగా సిహెచ్ సాయగౌడ్, ప్రధాన కార్యదర్శిగా జి.కిషన్, జిల్లా ఉపాధ్యక్షులుగా పి.రాజేశ్వర్, ఒడ్డేన్న, రాజేందర్, సహాయ కార్యదర్శులుగా గంగమల్లు, జంబు, నజీర్, కోశాధికారిగా మల్లయ్య మరియు 18 మంది కార్యవర్గ సభ్యులతో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏఐపీకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ సాయాగౌడ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం సమగ్ర వ్యవసాయ కార్మిక చట్టం చేసి అమలకు పూనుకోవాలని, ప్రభుత్వం అన్ని రకాల మిగులు భూములు వ్యవసాయ కార్మికులకు పంచాలని, గ్రామాల్లో రిజిస్టర్ ద్వారా వ్యవసాయ కార్మికుల పేర్లు నమోదు చేసి గుర్తింపు కార్డులను ఇవ్వాలని, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, వ్యవసాయ కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక లేబర్ డిపార్ట్‌మెంట్ ఏర్పాటు చేయాలని, వ్యవసాయ కార్మికులకు ట్రేడ్ యూనియన్ హక్కులు కల్పించాలని, వ్యవసాయ కార్మికులకు ఇండ్ల స్థలాలు ఉన్నవారికి ఇంటి నిర్మాణం కోసం ఎస్సీ, ఎస్టీలకు ఆరున్నర లక్షల రూపాయలు, బీసీ, ఓసీ, మైనార్టీలకు ఐదు లక్షల 50 వేల రూపాయలు ఇండ్ల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్, జిల్లా ఉపాధ్యక్షులు పి.రాజేశ్వర్, ఒడ్డెన్న, రాజేందర్ జిల్లా సహాయ కార్యదర్శి గంగమల్లు, నజీర్, జంబు, జిల్లా కోశాధికారి మల్లయ్య జిల్లా నాయకులు సంతోష్, రాజన్న, నారాయణ, వాసరి మోహన్, ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.

పట్టణ పద్మశాలీ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2023 సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ గురువారం సంఘం భవనంలో నిర్వహించారు. ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ ఈరవత్రి రాజశేఖర్, ప్రముఖ వ్యాపారవేత్త రష్యా నర్సయ్యతో కలిసి సంఘం అధ్యక్షులు అంబల్ల శ్రీనివాస్, కార్యదర్శి ఘనపుర సంతోష్ కుమార్ తదితరులు ఆవిష్కరణలో పాల్గొన్నారు. ఈ నెల 24న జరిగే మార్కండేయ, శోభాయాత్ర కార్యక్రమానికి భక్తులు హాజరు కావాలని వారు కోరారు.

నిరు పేద కుటుంబానికి అండగా ఫ్రెండ్స్ వెల్ఫేర్



నిత్యావసర సరుకులు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని హసకొత్తూరు గ్రామానికి చెందిన నిరుపేద పసుల లచ్చన్న కుటుంబానికి జగిత్యాల జిల్లా మెట్ పల్లికి చెందిన ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు అండగా నిలిచారు. పసుల లచ్చన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, 25 కిలోల బియ్యం, నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందించారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు సుర్గి శ్రీనివాస్ గౌడ్ , సర్పంచ్ ఏనుగు పద్మ రాజేశ్వర్ , రాంప్రసాద్, భగతేజ, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంతిమ సంస్కారం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ గురువారం నగరంలోని దుబ్బ రోడ్డులోని సార్వజనిక్ స్మశాన వాటికలో అనాధ శవానికి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందిన అనాధ శవానికి ఆర్మూర్ సీఐ సురేష్ బాబు అనుమతితో అంత్యక్రియలు నిర్వహించినట్టు ఆ సంస్థ అధ్యక్షుడు మద్దుకూరి సాయిబాబు తెలిపారు. ఆర్మూర్ బస్టాండ్ నందు అనాధగా ఆనారోగ్యంతో కదలలేని స్థితిలో ఉండగా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించారు. అయినా ఆరోగ్యం క్షీణించి చనిపోవడంతో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ ఈసీ మెంబర్ కాసుల సాయి తేజ, ఆర్మూర్ పోలీస్ సిబ్బంది, కానిస్టేబుల్ నాగారాజు తదితరులు పాల్గొన్నారు.



అంత్యక్రియలు చేస్తున్న సేవాసంస్థవారు

కొత్త పరిశోధనలపై దృష్టి పెట్టాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

విద్యార్థులకు చదువు, పరిశోధనలో తక్షణ ఆలోచనలు, కొత్త పరిశోధనలపై దృష్టి పెట్టాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పాథోలాజి యూనివర్సిటీ ఆఫ్ ఒబామా బేర్మింగ్ హెహామ్ ప్రొఫెసర్ డాక్టర్ ఉపేందర్ మన్నే అన్నారు. గురువారం తెలంగాణ యూనివర్సిటీలోని సెమినార్ హాల్ కంప్యూటర్ సైన్స్ భవనంలో విద్యార్థులతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సదస్సులో కీనోట్ స్పీకర్‌గా విచ్చేసిన ప్రొఫెసర్ ఉపేందర్ మన్నే మాట్లాడుతూ తన ప్రాథమిక విద్యాభ్యాసం మెదక్ లోని జోగిపేటలో జరిగిందని, లక్ష్మయ్య తెలుగు అధ్యాపకుడు తన రోల్ మాడల్ అని, తనకు సైన్స్ చెప్పిన జూనియర్ లెక్చరర్ రాజగోపాల్ రెడ్డి, తను సైన్స్ చదవడానికి స్ఫూర్తినింపారని, ఎమ్మెస్సీ (జంతుశాస్త్రం), పీహెచ్‌డీ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి పూర్తిచేసి ఢిల్లీలోని ఐసీఎంఆర్ ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్‌లో సైంటిస్ట్‌గా పని చేశారని తెలిపారు. మలేరియా దోమలపై పరిశోధన చేశానని, విద్యార్థులకు చదువు, పరిశోధనలో తక్షణ ఆలోచనలు ఉండాలని, కొత్త పరిశోధనలపై విద్యార్థులు దృష్టి కేంద్రీకరించాలని అన్నారు. మానవ శరీరంలో దాదాపు 30 మిలియన్ల బ్యాక్టీరియా వైరస్ నివాసం ఉంటున్నాయని, వీటిలో కొన్ని శరీరానికి మేలు చేసేవి మరికొన్ని శరీరానికి హాని చేసేవి ఉంటాయని తెలిపారు. ముఖ్యఅతిథిగా వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రవీందర్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువతపై ఆధారపడిందని ఈ సంవత్సరం ఎంటెక్, ఎంసీఏ విద్యార్థులకు పీహెచ్‌డీలో అవకాశాలు ఇచ్చామని తెలిపారు. ఈ సమావేశంలో యూనియన్ రిజిస్ట్రార్, ప్రొఫెసర్ విద్యావర్థిని, ప్రిన్సిపల్ సిహెచ్ ఆరతి, డైరెక్టర్ ఫారిన్ రిలేషన్స్, వివిధ విభాగాల అధ్యాపకులు, బయోటెక్నాలజీ విద్యార్థులు, ఫార్మసీ విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ఉపేందర్ మన్నే